


పది రోజులనుంచి వేస్తున్నాడా చిత్రాన్ని. కాని పోలికలు సరిగా రావటం లేదు. ఆ చిత్రంపైన - దిద్దినచోటే తిరిగి దిద్ద సాగాడు. అయినా పోలిక కలవటంలేదు. విసుగెత్తాక కళాకారునికుండవలసిన సహజ ఓరిమివల్ల తిరిగి చిత్రించసాగాడు. కాని ఫలితం శూన్యం.

అంతే - నాటినుండి అతనిలో ఏదో మార్పు వచ్చేసింది. కుంచెను ముట్టడు.... ఎవరితోనూ మాట్లాడడు.

ఊరి బయట ప్రశాంత వాతావరణంలో నిర్మించబడ్డ ఇల్లే-అతని నివాస గృహం. వివిధ దృక్కోణాలలో చిత్రించబడిన - సౌందర్యానికి గీటురాళ్ళయిన అభ్యంజన నగ్నాంగనలే అతని ప్రముఖ కళాఖండాలు. లక్ష్మీ కటాక్షపరుల భవంతులు అతని కళాఖండాలతో అలంకరించివుండేవి. వాటివల్ల లభించిన ధనాన్నాతడధికంగా ఏ అనాధ శరణాలయానికో.... ఏ కళానిలయానికో ప్రసాదించుకునేవాడు. ప్రముఖ కళాకారుడేగాక వేణువునూదటంలో ఇతని కతనే సాటి యనిపించుకున్నాడు.

అంతటివాడు ఇప్పుడో స్త్రీ పోలికను తేలేక పోతున్నాడు. అతని చిత్రాలన్నీ - అతడంతకు పూర్వం చూచిన ఏ లావణ్యవతి ముఖబింబానికో ప్రతిబింబంగా ఉంటాయి. కాని ఈ సారి... తాను చూచిన ఆ సుకుమారి ముఖారవిందాన్ని చిత్రించలేక పోతున్నాడు. ముఖ్యంగా - ఆమె కళ్ళలోని ఆ మైకాన్ని.... చూపలేక పోతున్నాడు. పారబోసిన ఆ రంగులను, విసిరివేసిన కుంచెలను, చిత్రించలేని చిత్రాన్ని చూస్తూ వెఱ్ఱివాడయి పోతున్నాడు.

ఎందుకలా అతని చేతుల్లోని శక్తి నీరసించిందో అతనికే తెలియదు.

ఆమె ప్రథమ దర్శనం జ్ఞాపకానికొచ్చింది

సైబ పరంధాములు

ఒకసారి అతడొక నృత్యనాటకానికి వెళ్ళాడు అందులో - కథానాయిక విరహాగ్నిలో జ్వలించి పోతోంది. ప్రియుడు రాలేక పోతాడు.... అట్టి స్థితిలో నిరీక్షిస్తున్నట్లున్న ఆమె విశాల నయనాలలోని ఆ ప్రణయ మైకం.... అరుణాంకిత పెదవుల కదలిక.... గుండ్రని ఆ ప్రజ్వలిత మోమునందలి గులాబీల చెక్కిళ్ళు.... ప్రణయేశ్వరుని ఆగమ ప్రతీక్షలో ఉబికివస్తున్న కుచద్వయం.... అతనిలో ఏదో - రగుల్కొలిపింది

నాటకానంతరం ఒంటరిగా నున్న ఆమెను కలుసుకున్నాడు తనను గూర్చి తనే చెప్పుకున్నాడు.

"చాలా బాగా నటించారండి ఆ.... మైకంలో పూర్తిగా మునిగి పోయారంటే నమ్మండి. అబ్బ.... మీరు...."

అతని మాటలు సుకుసుమాలయి ఆమెపై వర్షించ సాగాయి. వాటి సౌగంధాన్నాస్వాదించి మత్తెక్కి పోతున్నది.

"....నిజంగా మీరు కళారాధకులండీ. ఎంత బాగా పోషించారండి మీ పాత్రను! మీలా - అలాగా.... ఎవరూ నటించలేరంటే నమ్మండి. ముఖ్యంగా ప్రథమ రంగంలో...."

"ఆగండి!...." మధ్యలో చిరుకోపంతో అంది.

"ఒంటరి ఆడదాన్నని అయినా గుర్తించకుండా ఏమో వాగేస్తున్నారేమిటి?" అప్రయత్నంగా ఆమె నాలుక చివరికి వచ్చేశా యీ మాటలు. అయినా అతని ఎడ ఆమెలో ఏదో.... ప్రగాఢమయిన వాంఛ అంకురించింది.

"పరవాలేదండి, ఒక కళా హృదయుడు మరో కళా హృదయాన్ని సులువుగా గ్రహించగలడు...."

అతడలా మాట్లాడుతూ ఉన్నంతవరకు ఆమెలో ఎన్నో భావాలు చెలరేగాయి. అతని అమాయక మోమును చూచి ముఖ్యంగా గాఢాలింగనముఁ గావించి

ముద్దెట్టుకోవాలనిపించింది. ఆ కన్నుల్లోని ఉజ్వలకాంతి - కొన దేలిన నాసిక వల్ల ప్రస్ఫుట మవుతున్న యతని నిష్ఠ ఆమెను వివశగా నొనర్చుతున్నాయి.

"క్షమించండి! మీకేమైన కష్టం గలిగి యుండొచ్చు. నేను వెళ్ళొస్తాను.... సెలవు - మళ్ళీకలుసుకుందాము!"

అతడు వెళ్ళిపోతుంటే తనలో నుండి ఏదో దూరమవు తున్నట్టుగా బాధపడిం దామె.

ఇంటికి చేరుకొని ఆమెను గురించి బాగా యోచించసాగాడు. ఇంతవఱకాతడు తన జీవితంలో చవిచూచిం దొక్కటే ప్రేమ - మాతృప్రేమ. కాని ఈసారి అతనిలో కామ వాంఛ ప్రబల మవసాగింది. అలవాటు ప్రకారం ఆమె చిత్రాన్ని చిత్రించ దలిచాడు. కాని.... అది ఈ స్థితికి దిగజార్చింది.

అతడు మనఃస్థిమితాన్ని కోల్పోసాగాడు. తాత్కాలి కానందానికి గాను ఎప్పుడూ వేణువు నూదడం మొదలెట్టాడు.

ఒకనాటి అర్ధరాత్రి అతడు ఇంటి బయట వృక్షచ్ఛాయలో వేణువు నూదుచూ కూర్చున్నాడు. వెన్నెల విరివిగా వ్యాపించి ఉంది. హఠాత్తుగా ఏదో కూనిరాగం, దాని వెను వెంటనే - అనుగుణంగా గజ్జెల లయ వినబడింది. వేణువు ఆపాడు. రాను రాను ఆ... రాగం, లయ దగ్గరవసాగింది. ఏదో అందమైన ఆకారం దూరం నుండి గెంతుతూ రాసాగినట్టు తోచిం దాతనికి. ఆ రాగం మతనిలో ఏదో - రగుల్కొలిపింది. తిరిగి వేణువు నూదసాగాడు నృత్య భంగిమల్లో గెంతుతూ.... ఆ అందమైన ఆకారం అతన్ని పూర్తిగా సమీపించింది - అతని చరణాలపై వ్రాలిపోయింది.

"ఏమండీ.... నాకు ప్రసాద మివ్వరూ....?" చిలిపిగా అతనికళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది.

"నేనా.... నేను పూజలు చేయనే....!"

"ఏం.... ఎందరికో.... ఎన్నో.... ప్రసాదించి, మీ నామాన్ని సార్థకం చేసుకున్నారు. మరి నాకూ ప్రసాదించ లేరూ...."

ఆశ్చర్యపోయాడు "ప్రసాద్"

"ఏం ప్రసాదించగలను నావద్దేముందని....!" వేణువును ప్రక్కన పెడ్తూ పలికాడు.

ఒక కళాభిరుచి గలవారు మీ ముందు నిలుస్తే మీరేం ప్రసాదించుకుంటారు...."

"నేనా - నేను.... నా హృదయాన్ని ప్రసాదించుకుంటాను" ఈ మాటలు బాగా ఆలోచించిన మీదటే బయల్వెడలినవి.

"నాక్కావలసిం దదే...." యంటూ హఠాత్తుగా ప్రసాదును గట్టిగా కౌగలించుకుంది అత్యధిక సంతోషం మామెలో ఉప్పొంగింది. ప్రసాదును ఏదో వింత మైకం క్రమ్మేసింది అతని చేతుల్లోకి ఏదో నూతనశక్తి ప్రవేశించింది- మెల్లిగా ఆమె సన్నని నడుమును పెనవేసుకున్నాయి.... దగ్గరగా లాక్కున్నాడు. ఏదో విచిత్రానుభూతి అతనిలో చెలరేగింది.

అప్పుడాతనికి - అప్పుడెప్పుడో తల్లి అన్న మాటలు జ్ఞాపకానికొచ్చాయి. అప్పుడు ప్రసాద్ చాలా గడుగ్గాయి. "నీ బొమ్మేస్తానని" ఏ అమ్మాయినన్నా ముందు కూర్చోబెట్టుకొని, ఓ పది నిముషాల్లో ఆమె ముఖాన్ని గీసుకునేవాడు, తరువాత శరీరాన్ని నగ్నంగా చిత్రించి తన స్నేహితులకు చూపుతూ ఆ అమ్మాయిని ఏడిపించేవాడు. అందువల్ల ఏ అమ్మాయి గూడా ప్రసాద్ చిత్రాలలోకి రావాలని అభిలషించేదిగాదు. కాని ఇప్పుడు మాత్రం అతని చిత్రాలలో నుండాలని ఉవ్విళ్ళూరు తుంటారు. అతడు తమ చిత్రాన్ని వేస్తే, తమ జీవితమే ధన్యమయి నట్టుగా భావించేవారు.

ఓసారి తల్లి అడిగింది- "ఏరా! నీవు అందరు మనుషులను చిత్రించగలవా....?

"ఓం.... చిత్రించగలను ముఖ్యంగా అమ్మాయిల నయితే భేషుగ్గా.., "సంతోషంగా, సిర్పయంగా అన్నాడు ప్రసాద్,

"కాని, ఒక మాట జ్ఞాపక ముంచుకోరా.... ఏ అమ్మాయి చిత్రాన్ని నీవు చిత్రించలేవో ఆ అమ్మాయే నీ భార్య ఏం"

అప్పుడు సిగ్గుతో వెళ్ళిపోయాడు- ప్రసాద్,

"నిజమే....!" అనుకున్నాడిప్పుడు ప్రశ్నించినా జవాబీయ తల్లిగూడా లేదు. ప్రసాద్ పుట్టినప్పుడే తండ్రి స్వర్గవాసుడయ్యాడు, అతని పదిహేనవ ఏట హఠాత్తుగా తండ్రి దరిచేరింది తల్లి. తల్లి చనిన సంవత్సరం వఱకూ అతడు పిచ్చివానిలా తయారయ్యాడు. ఉద్యోగం కొఱకెన్నో చోట్లు తిరిగాడు. అందరూ 'లేదు పొమ్మన్నారు అతనికి తల గొట్టేసినట్లయింది. చివరికాతనిలో ప్రపంచంపై ప్రతీకార భావావేశం ఉప్పొంగింది. మెల్లిగా ఎలాగో ధైర్యంచేసి ఒక ధనవంతుని పర్సు కాజేశాడు అందులో రెండువందల రూపాయలు, కొంత చిల్లర ఉన్నాయి. అంతే- ఆనాడే చిత్రకారునికి కావలసినన్ని పరికరాలు, వస్తువులు కొన్నాడు. నాటినుంచి ఆరంభించాడు సుందరాంగుల వేట అతనికి తెలుసు.... అందగత్తెల అవయవ సొంపులు వీక్షించ తహ తహలాడే వారెందరో.... అలా ఎందరో యవ్వనులను తన చిత్రాల్లో అర్ధనగ్నంగా, ఆకర్షనీయంగా చిత్రించి వేలం పాడించేవాడు. ఇలా ఎన్నో వందల చిత్రాలు అమ్ముడు పోయాయి. దాంతో మంచి పేరూ వచ్చింది.

"ఏమండీ...." పిలిచిందామె.

"నా జ్యోతీ....!" హృదయానికి గట్టిగా హత్తుకున్నాడు.

'అవునండీ! నా పేరు జ్యోతే...." ఆశ్చర్యంగా అతని కళ్ళల్లోకి చూస్తూ- అతని జుత్తులోకి వ్రేళ్ళను పోనిచ్చింది.

'తెలుసు....నిజంగా నీవు నా హృదయ జ్యోతివి.... కళాజ్యోతివి అందువల్లే నైజ కళాస్వరూపాన్ని చిత్రించలేకపోయాను"

"ప్రసాద్....?" అంది జ్యోతి అతని హృదయంలోనేమో.... స్థానం చూచుకుంటోంది,

'నా జ్యోతీ....!" యంటూ గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు.

చెట్టుపైని కోయిలలు 'కుహూ.... హూ' మన్నాయి.

పిల్లగాలుల వల్ల వేణువునుండి వింత ధ్వనులు బయలుదేరాయి.

రెండు 'కళాహృదయాలు' ఏకమ్యాయి.